క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి ట్రంక్ పెట్టెల అందజేత



నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ సమీపంలోని రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి 12 ట్రంక్ పెట్టెలను బుధవారం అందజేశారు. మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీసీతారామస్వామి ఆలయ ధర్మకర్త మండవ సీతారామాంజనేయులు సహకారంతో అందచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో విజయవాడ దుర్గగుడి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు నిడమానూరి కల్యాణి, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

మిల్లెట్స్ స్టాల్ ఏర్పాటు



రొంపిచర్ల: మండలానికి చెందిన స్వయంసహాయక సంఘాల యానిమేటర్లు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం మిల్లెట్స్‌తో తయారు చేసిన తినుబండారాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో తృణ ధాన్యాలైన రాగి, జొన్న, సజ్జలుతో పాటు మినుములు, కొబ్బరి, జీడిపప్పు, శనగలతో తయారు చేసిన జావ, రొట్టెలు, బూరెలు, సున్నిండలు, కొబ్బరిలడ్డులు, జీడిపప్పుతో తయారు చేసిన పప్పుచెక్క, శనగ గుగ్గిళ్లను కూడా స్టాల్‌లో ఉంచారు. కలెక్టరేట్ కు వచ్చిన ప్రజలతో పాటు అక్కడి అధికారులు, సిబ్బందిని స్టాల్ ఆకట్టుకుంది.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



రొంపిచర్ల: స్థానిక సచివాలయం ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం దగ్ధమైంది. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి మంటలు వస్తుండటంతో స్థానికులు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి సరఫరాను నిలుపుదల చేయించారు. విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

14న వీరభద్రేశ్వరస్వామి శిఖర ధ్వజ పునఃప్రతిష్ట

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో శ్రీభీమేశ్వర శ్రీ వీరభద్రేశ్వరస్వామి వార్ల బింబయంత్ర శిఖర ధ్వజ పునఃప్రతిష్టమహోత్సవం ఈ నెల 14వ తేదీన జరగనుంది. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ ఆవరణలో గురుప్రార్థన, గణపతిప్రార్థన, యోగశాల ప్రవేశం, బూతబలి, గణపతిపూజ లాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాంచాహ్నిక దీక్షగా నైనాగశాస్త్ర విధానంగా కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామానికి చెందిన స్వర్ణ రుద్రాక్ష కంకణ సన్మానిత గండపెండేర సన్మానిత గ్రహీతైనటువంటి బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ,కాళ్ళకూరిదుర్గాప్రసాద్ యనమండ్రసత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఆగమ పండితులు పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

నాదెండ్ల: భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదని మనస్తాపానికి గురై భర్త పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. జంగాలపల్లె గ్రామానికి చెందిన కట్టా రాజేష్(26) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం నాదెండ్ల గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు రావటంతో చిన్న కుమారుడిని తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు రావాలని కోరినా రాకపోయే సరికి మనస్తాపానికి గురై ఈ నెల 5వ తేదీన రాజేష్ పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రాజేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నూతన చర్చి ప్రతిష్టా మహోత్సవం

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలో పరిశుద్ధమత్తయి లూథరన్ దేవాలయం నూతన ప్రతిష్టమహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు సినడ్ బిషప్ రెవ.ఎస్.జె.బాబురావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తుసందేశం అందించారు. ఈ సందర్భంగా చర్చిలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎఈఎల్‌సీ ట్రెజరర్ కె.మోజేస్‌ఆర్నాల్డ్, బొల్లెద్దుమాథ్యూ, బ్రాటన్ స్కూల్ డైరెక్టర్ కంచర్లకృపారావు, సంఘ కాపరి ఇశ్రాయేలు, మెడబలిమి సత్యానందంలు పాల్గొని సందేశాన్ని అందించారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

నాదెండ్ల: పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్ష చిలకలూరిపేట నియోజకవర్గంలోని ఆరు కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగింది. 1870 మంది విద్యార్థులకు గాను 1654 మంది(88.4శాతం) పరీక్షకు హాజరయ్యారు. గణపవరం సీఆర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 400 మందికి గాను 344 మంది హాజరయ్యారు. చిలకలూరిపేట ఏఎంజీ కేంద్రంలో 400కు గాను 364 మంది, శారదా హైస్కూలులో 350కు 313 మంది, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూలులో 350కు 314 మంది, మోడరన్ గ్రీన్ వ్యాలీలో 203 మందికి గాను 175 మంది, చైతన్య హైస్కూలులో 167 మందికి గాను 144 మంది హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధనను పక్కాగా అమలు చేశారు. సీఆర్ కళాశాల సెంటర్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.డేవిడ్‌రాజు, జిల్లా అబ్జర్వర్‌గా మస్తానయ్య, రూట్ ఆఫీసర్ ఎన్‌సీహెచ్ రామన్న, సెంటర్ అబ్జర్వర్ విజయకుమార్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు పరీక్ష ముగిసింది. అభ్యర్థులు 9 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. 9.45 నిమిషాలకు పరీక్ష కేంద్రంలోనికి హాల్‌టికెట్లు తనిఖీ చేసి అనుమతించారు. 11 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కానందున పరీక్ష కేంద్రం వద్ద ఆధారాలు చూపి పొందారు. డెప్యూటీ కోఆర్డినేటర్‌గా పి.లక్ష్మీరాజ్యం పర్యవేక్షించారు.



గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

ఇంటి అద్దె 16 శాతం పెంపుదలపై హర్షం

నరసరావుపేట: ఏపీఎన్‌జీవో సంఘం అభ్యర్థన మేరకు అన్నీ జిల్లా కేంద్రాల్లో పనిచేసే కార్యాలయ ఉద్యోగులకు 16 శాతం ఇంటి అద్దె అలవెన్సు పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వానికి నరసరావుపేట యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు మర్లపాటి రామకృష్ణ, మాదాసు ఆనందనాథ్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ కె.జవహర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు అందరి ఉద్యోగులతో పాటు పోలీస్ సిబ్బందికి కూడా సరెండర్ లీవ్‌లు, పీఆర్సీ ఎరియర్స్ మే నెలాఖరు లోగా మంజూరు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధీకరించాలని, 12వ పీఆర్‌సీ కోసం కమిటీ వేసి సత్వరమే అమలు చేయాలని కోరారు.

ఆర్బీకేల్లో మొక్కజొన్న కొనుగోలు



చిలకలూరిపేట టౌన్: రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీలత చెప్పారు. బుధవారం మండలంలోని రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం క్వింటా ధర రూ. 19,062లుగా మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ ఉద్యాన సహాయకులను కలిసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

వేసవి దుక్కులతో ఎంతో ప్రయోజనం

చిలకలూరిపేట టౌన్: వేసవి దుక్కులతో ఎంతో ప్రయోజనం ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని కావూరు, లింగంగుంట్ల ఆర్బీకేలో బుధవారం సార్వా సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంట సాగుకు ముందుకు చేపట్టాల్సిన అన్ని యాజమాన్య పద్ధతులు వివరించారు. పచ్చిరొట్ట ఎరువులతో పంటకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కౌలుకు పొలం సాగు చేసే రైతులు సీసీఎన్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిలకలూరిపేట ఉద్యాన శాఖ అధికారి కిషోర్ యాదవ్, ఏఈఓ శ్రీనివాసరావు, వీఏఏ రాణి, వీహెచ్ఏ హాఫీజ్, గ్రామ సర్పంచ్ హమీదాబి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీఏ ఎం.శివకుమారి

జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెంలో టైగర్ సీసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెన్నిస్ క్రికెట్ టోర్నమెంటు పోటీలను ఎస్ఐ గల్లా రవికృష్ణ బుధవారం ప్రారంభించారు. మొదట బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు విజేతలకు అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తెలప్రోలు రాఘవేంద్రరావు, మలిశెట్టి నరేష్, వడ్రాణం నాగేశ్వరరావు, యడవల్లి శ్రీను, తెలప్రోలు రవీంద్రబాబు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.26 కోట్లు

శావల్యాపురం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి నియోజకవర్గానికి స్త్రీనిధి రుణాలు రూ.26కోట్లు లక్ష్యంగా ఎంచుకున్నట్లు స్త్రీనిధి మేనేజరు రంతు చిన బుల్లెయ్య అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మాట్లాడారు.

వీఆర్‌ఏలు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

బొల్లాపల్లి: నియోజకవర్గంలోని వీఆర్‌ఏలు ఆయా సంఘాలు ఇస్తున్న ఆందోళన కార్యక్రమాలకు హాజరుకావద్దని మండలానికి చెందిన ఏపీ వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూపాటి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధైర్యం, ప్రధాన కార్యదర్శి సత్యరాజ్ ఆధ్వర్యంలో ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.ఎస్.దివాకర్ తదితరులు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని డీఏ విషయమై కలవగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని, అలాగే ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలవడం జరిగిందని, వారు వెంటనే స్పందిస్తూ డీఏ మంజూరుకు, వీఆర్‌ఏల పదోన్నతులు కూడా వెంటనే పూర్తి చేస్తామని తెలిపారన్నారు.

పూరిల్లు దగ్ధం

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడులో అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. సుమారు రూ. లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. వివరాలు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన కన్నెబోయిన అచ్చమ్మ పూరిల్లు ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. ప్రమాదం సమయంలో గృహంలోని వారంతా పొలం పనులకు వెళ్లారు. మంటలు రావటం చూసిన స్థానికులు మంటలు అదుపు చేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ అధికారులను ఘటనా స్థలానికి పంపి పరిశీలించారు. అగ్ని బాధిత కుటుంబానికి బియ్యం, కందిపప్పు, పంచదార లాంటి నిత్యావసర వస్తువులను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో సాంబశివరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: మండల పరిధిలోని ఫణిదం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ముందుగా మంత్రి అంబటి రాంబాబుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకల్లో పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. శ్రీవారి కల్యాణ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంత్రి అంబటితో పాటు వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పంచుమర్తి అప్పారావు, సర్పంచ్ వేమవరపు బుల్లి బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు, భక్తులు, తదితరులు ఉన్నారు.



శ్రీవారి కల్యాణ వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు

మానసిక వైద్యుల సేవలు ప్రశంసనీయం

సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి

గుంటూరు మెడికల్: మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో వైద్యులు ఈ విభాగాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా బుధవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాన్ని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆ విభాగం వైద్యులతో సమీక్షించారు. మానసిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడినప్పుడు వైద్య సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక సమస్యలకు వైద్యులు వైద్య సేవలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య వృత్తిలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచన ఎక్కువైందని వివరించారు. మానసిక వైద్య విభాగాన్ని వైద్యులు ఎంపిక చేసుకోవడం చాలా అరుదుగా కనిపిస్తోందన్నారు. మహిళా వైద్యులు కూడా ఈ విభాగాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు న్యాయ పరమైన సమస్యలు ఉంటే ఆస్పత్రిలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్, మాజీ అదనపు పిపి కట్టా కాళిదాసు, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నిమిషా, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రోగిని పరామర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి, పక్కన కట్టా కాళిదాసు

జయ 'జైన్' ధ్వానాలు



విద్యానగర్ 3వ లైన్‌లో కొత్తగా నిర్మించిన జైన్ గుడి ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో జైన్ సంప్రదాయం ప్రకారం.. విశేష కార్యక్రమాలు నిర్వహించారు. జైన్ గురు మణి ప్రభ్ సూరీజి గురువారం ఉదయం జరిగే గుడి ప్రతిష్ట కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సుక్కిరాజ హుండియా, అశోక్ హుండియా, మహేంద్ర గులేచా, జుగ్రాజ్ భండారి, జైన్‌లు పాల్గొన్నారు. జైనుల జయజయధ్వానాలతో ఆ ప్రాంతం మార్మోగింది.



– పాత గుంటూరు

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీ-13 సెక్షన్‌లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ వివరాలను విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు బుధవారం వెల్లడించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 4,808 సర్వీసులు తనిఖీచేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 370 మందికి రూ.19.7 లక్షలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండాలని, సీలు లేకున్నా.. తుప్పుపట్టి ఊడినా వెంటనే అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. మీటర్లకు సీలు లేకపోతే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం చేస్తూ దొరికితే అపరాధరుసుం విధిస్తామని, రెండోసారి అదేతప్పు చేస్తే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా, వాట్సాప్ ద్వారా చేయవచ్చని వివరించారు. తనిఖీల్లో డీఈఈ ఎం.రవికుమార్, పి.హెచ్.ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, వి.బాజీ పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీబ్రహ్మానంద రెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని బుధవారం గురజాల తహసీల్దార్ ఎం.దానియేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్య నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, లలిత కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. క్రీడల ద్వారా శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందన్నారు. క్రీడాస్ఫూర్తి అలవడిన విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకొని ఉన్నతంగా ఎదుగుతారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజనందరెడ్డి జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు, ఎన్ఈసీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఇశ్రాయిల్‌ప్రసాద్ పాల్గొన్నారు.



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గురజాల తహసీల్దార్ దానియేల్

గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులపై అధ్యయనం

నూజెండ్ల: విద్యార్థులు గ్రామాల్లో ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ఇంటర్న్‌షిప్‌లో డాక్యుమెంట్లు అందజేయాలని కేంద్ర సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు టి.నరసింహ అన్నారు. నూజెండ్ల మండలం జడ్డవారిపాలెంలో పారా లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ గ్రామాల్లో ఉందని, గ్రామస్వరాజ్యం సాధించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అధ్యయనం చేసి ప్రజలకు ఏ స్థాయిలో లబ్ధి చేకూరుతుందో గుర్తించాలన్నారు. స్టడీ సర్కిల్ అధినేత పారా లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పబ్లిక్ పాలసీ, ఆంత్రోపాలజీపై కోర్సులు గ్రామీణ ప్రాంతాల ప్రజల గురించి, వారి పరిస్థితులు సమగ్రంగా తెలుస్తాయన్నారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థి విభాగం ఓంప్రకాష్ మాట్లాడారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రధానమంత్రి మోదీ కమిటీ సభ్యులు టి.నరసింహ

రైతులు అధిక పాల ఉత్పత్తి సాధించాలి

బొల్లాపల్లి: పాడి పరిశ్రమలో యాజమాన్య పద్ధతులు అవలంబించి అధిక పాల ఉత్పత్తి సాధించాలని నరసరావుపేట పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు సూచించారు. మండలంలోని మూగచింతలపాలెం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేస్తున్న సమీకృత దాణాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెయ్యదూడల ఉత్పత్తిలో భాగంగా ట్రిపుల్ ఎస్ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి, పశువైద్యాధికారి పి.అమీర్‌బాషా, ఏహెచ్ఏ ఏడుకొండలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ఈపూరు: కౌలుకు భూమిని సాగు చేసుకుంటున్న రైతులు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు తెలిపారు. మండలంలోని వనికుంట, కొండాయపాలెం గ్రామాల్లో ఖరీఫ్ సాగు సమాయత్తంపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రామారావు మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు ముందుగానే అందుబాటులో ఉండేవిధంగా సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, వనికుంట సర్పంచి బచ్చనబోయిన వెంకటసుబ్బయ్య, కొండాయపాలెం గ్రామసర్పంచి కేతినేని వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.ఆనంద్ బాబు, వి.గణేష్ పాల్గొన్నారు.

మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: ప్రజల శ్రేయస్సు కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు వరకు జరిగే అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో గుంటూరు ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం నాజ్ సెంటర్ కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో మహా యజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే మహాయజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాసరావు, చైర్మన్ పి.జయ ప్రకాష్ రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకట రత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వర రావు, వెంకట రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.



మహా యజ్ఞం పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముస్తఫా

టెన్త్ టాపర్ నిఖిల్‌కు సత్కారం

సత్తెనపల్లి: పదవతరగతిలో ప్రతిభ కనబరిచి 584 మార్కులు సాధించిన బాలనాగు నిఖిల్‌కు ఆర్యవైశ్య యువజన సంఘం, ఆవోప ఆధ్వర్యంలో బుధవారం సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.నగేష్ పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఇక ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కొని యాడారు. కార్యక్రమంలో ఆవోప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం సభ్యులు కొత్తూరు విశ్వేశ్వర రావు, సంకుల తిరుపతిరావులు ఉన్నారు.



నూతలపాటికి జవ్వాది రంగస్థల చైతన్య అవార్డు ప్రదానం

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థలం నటుడు, దర్శకుడు, ప్రగతి కళామండలి గౌరవ అధ్యక్షుడు నూతలపాటి సాంబయ్యకు జవాది రంగస్థల చైతన్య అవార్డును మంగళవారం భీమవరంలో బహూకరించారు. చైతన్య కళాభారతి పరిషత్ నాటక పోటీలు సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్, సినీయాక్టర్లు శుభలేఖ సుధాకర్, మ్యూజిక్ డైరెక్టర్ కోటి, చైతన్య కళాభారతి పరిషత్ ప్రెసిడెంట్ రాయప్రోలు భగవాన్ చేతుల మీదుగా నూతనలపాటి సాంబయ్య అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సాంబయ్యను బుధవారం ప్రగతి కళామండలి బాధ్యులు, కళాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

